
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
బుధవారం 22 అక్టోబరు 2025





అత్యధిక..

సేల్స్ వైన్సే టార్గెట్

- వైన్సులు దక్కించుకోవడమే లక్ష్యంగా గ్రూపులు
- 10 నుంచి 20 మంది కలిసి టెండర్లు
- వైన్స్‌ల టెండర్లలోనూ సిండికేట్
- జిల్లాలో ఇప్పటి వరకు 1,448 దరఖాస్తులు
- ఇప్పటికే మూడు రోజుల పాటు దరఖాస్తుల పొడగింపు
- రేపటితో ముగియనున్న దరఖాస్తుల గడువు
- చివరి రోజు అత్యధికంగా దరఖాస్తులు వచ్చే అవకాశం

కామారెడ్డి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ సారి మద్యం దుకాణాలను ఎలాగైన దక్కించుకోవాలనే భావనలో కొందరు మద్యం వ్యాపారులు, మరి కొందరు ఆశావహులు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని 5 ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో అత్యధికంగా మద్యం సేల్స్ అయి లాభాలు వచ్చే వైన్స్‌లనే టార్గెట్‌గా చేసుకుని దరఖాస్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కొందరు మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి వైన్స్‌లకు దరఖాస్తులు వేస్తున్నారనే చర్చ సాగుతోంది. ఎన్నికల కారణంగా ఈసారి మద్యం దుకాణాలు దక్కించుకుంటే మంచి లాభాలే ఉంటాయని భావిస్తు మద్యం వ్యాపారులు టెండర్లపై దృష్టి సారించారు. మద్యం వ్యాపారులంతా ఒక గ్రూప్‌గా ఏర్పడి ఒక్కో వైన్స్‌పై 15కు పైగానే దరఖాస్తులు వేస్తున్నట్లు తెలిసింది. అయినప్పటికీ లక్కీడ్రా ద్వారా ఎవరికి దుకాణం దక్కుతుందో చూడాలి. అయితే ఇప్పటి వరకు జిల్లాలో 1,448 దరఖాస్తులు వచ్చాయి. ఈసారి గతంతో పోలిస్తే 2000లకు పైగా దరఖాస్తులు చేయించడమే ఎక్సైజ్ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ టార్గెట్‌ను రీచ్ అవుతారా లేదా అనేది చూడాలి. గురువారంతో దరఖాస్తుల గడువు ముగియనుంది. చివరి రోజు భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది.

సిండికేట్‌గా మద్యం వ్యాపారులు

జిల్లాలోని మద్యం దుకాణాలు దక్కించుకోవడమే లక్ష్యంగా కొంతమంది మద్యం వ్యాపారులు గ్రూప్‌లుగా ఏర్పడి ఎక్కువ దరఖాస్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కో గ్రూప్‌లో 10 నుంచి 20 మంది సభ్యులు ఉన్నట్లు సమాచారం. వీరు 3 నుంచి 5 మద్యం దుకాణాలకు టెండర్లు వేస్తున్నట్లు తెలిసింది. టెండర్ డబ్బులు నష్టపోకుండా సిండికేట్‌గా మారుతున్నారు. గ్రూప్‌లోని ఏ ఒక్కరికి దుకాణం వచ్చినా సభ్యులందరు వ్యాపారంలో భాగస్వామ్యులు కావచ్చనే ఉద్దేశ్యంతో ఇలా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా చాలా చోట్ల ప్రభుత్వ ఉద్యోగులు సైతం వారి కుటుంబ సభ్యుల పేరిట దరఖాస్తులు వేసినట్లు తెలిసింది. మహిళలు సైతం దరఖాస్తులు చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా సేల్స్ ఉన్న 15 దుకాణాలకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. వీటిపై కూడా మద్యం సిండికేట్ వ్యాపారులు కన్నేసినట్లు తెలిసింది. పలుకుబడి ఉన్న కొంతమంది మద్యం వ్యాపారులు తాము ఎంచుకున్న దుకాణాలకు ఎవరు పోటీ రాకుండా ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతుంది. కొన్నిచోట్ల మద్యం విక్రయాలు బాగానే ఉన్నా దరఖాస్తులు తక్కువ రావడంపై అనుమానాలకు తావిస్తోంది.

పెరిగిన పోటీ

ఈ సారి మద్యం దుకాణాలను దక్కించుకుంటే బాగానే లాభాలు వస్తాయనే భావనలో మద్యం వ్యాపారులతో పాటు మరికొందరు ఆశావహులు ఉన్నారు. అయితే మద్యం దుకాణాలు దక్కించుకున్న వారందరికీ స్థానిక సంస్థల ఎన్నికలు ఉండే అవకాశాలు ఉన్నాయి. దీంతో మద్యం సేల్స్ భారీగానే జరిగి లాభాలు వస్తాయనే ఆలోచనలో ఉన్నారు. మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు వ్యాపారులు ఆశావహులు భారీగానే దరఖాస్తులు వేస్తుండడంతో పోటీ పెరుగుతోంది. అందరూ ఊహించనట్లుగానే జిల్లాలో 49 మద్యం దుకాణాలకు పోటీ పెరిగింది. 2023తో పోలిస్తే ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్య కాస్త తగ్గింది. దరఖాస్తులకు రేపటితో చివరి గడువు కానున్నందున మరింత దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లాలోని 49 మద్యం దుకాణాలకు 1,448 దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాది జిల్లాలో 49 మద్యం దుకాణాలకు 1940 దరఖాస్తులు రాగా రూ.38.80 కోట్ల ఆదాయం కేవలం దరఖాస్తుల రూపంలోనే ప్రభుత్వానికి చేకూరింది. ఈ ఏడాది గడువు పెంచడంతో మరిన్ని దరఖాస్తుల సంఖ్య పెరిగి ఆదాయం పెరగనుంది. ఎక్సైజ్‌శాఖ ఈసారి మద్యం టెండర్లకు సుమారు 2000లకుపైగా దరఖాస్తులు వచ్చేందుకు టార్గెట్‌గా పెట్టుకున్నారు.

భారీగా దరఖాస్తులు

జిల్లాలోని 49 మద్యం దుకాణాలకు భారీగానే దరఖాస్తులు వస్తున్నాయి. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1448 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్‌శాఖాధికారులు తెలిపారు. కామారెడ్డి ఎక్సైజ్ పరిధిలో 449, దోమకొండ సర్కిల్ పరిధిలో 307, ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలో 226, బాన్సువాడ సర్కిల్ పరిధిలో 240, బిచ్కుంద సర్కిల్ పరిధిలో 222 వచ్చాయి.ఇందులో తాడ్వాయి వైన్స్‌కు అత్యధికంగా 69 దరఖాస్తులు వచ్చినట్లు తెలిసింది. గురువారం మద్యం దుకాణాలకు దరఖాస్తుల గడువు చివరి రోజు కానునందున పెద్ద మొత్తంలో దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.



వైన్స్‌కు దరఖాస్తు తీసుకుంటున్న ఎక్సైజ్ సిబ్బంది

త్వరలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ప్రారంభం

- మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మహేష్‌కుమార్

కామారెడ్డి టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ ద్వారా ప్రారంభించనున్నట్లు జిల్లా మేనేజర్ మహేష్‌కుమార్ తెలిపారు. బాన్సువాడ మండలంలోని బోర్లం పీఏసీఎస్, బిచ్కుంద మండలంలోని పుల్కల్ పీఏసీఎస్, పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని పీఏసీఎస్, పిట్లం పీఏసీఎస్, భిక్కనూరు మండలంలోని అంతంపల్లి, బస్వాపూర్ పీఏసీఎస్‌లలో, మాచారెడ్డి మండలంలో సోమారిపేట పీఏసీఎస్, రాజంపేట మండలంలోని రాజంపేట, ఆర్గొండ, కొండాపూర్ పీఏసీఎస్‌లలో, గాంధారి మండలంలోని ఏఎంసీ, ముధోళి పీఏసీఎస్‌లలో, సదాశివనగర్ మండలంలోని భూంపల్లి, ఉత్నూర్, సదాశివనగర్ పీఏసీఎస్‌లలో, తాడ్వాయి మండలంలోని తాడ్వాయి, ఎర్రాపహాడ్, దేమికలాన్ పీఏసీఎస్‌లలో కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులు 14 శాతం తేమ ఉండేటట్లు ఎండబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2400 అందించనున్నట్లు తెలిపారు.



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

ముగిసిన జానపద నృత్య పోటీలు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల ఆలోచనలను జానపదాలు ప్రతిబింబిస్తాయని డీఈవో రాజు తెలిపారు. మంగళవారం ఎస్‌సీఈఆర్‌టీ జనాభా విద్యాభాగం, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జానపద నృత్యపోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. 64 కళలలో నృత్యానికి చాలా ప్రాధాన్యం ఉందని ఆయన తెలిపారు. జానపద నృత్యం గ్రామీణ ప్రజల గుండె చప్పుళ్లను ప్రతిధ్వనిస్తుందని అన్నారు. ఈ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దేవునిపల్లి విద్యార్థులు ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, సోమారంపేట విద్యార్థులు ద్వితీయ, ఇసాయిపేట విద్యార్థులు తృతీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 20 పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ నాగవేందర్, న్యాయ నిర్ణేతలు వసుధ, మనోహర్, భవాని, శిశు మందిర్ ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తులను ఆశ్రయించొద్దు

- డీటీవో శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాలకు సంబంధించిన ఏ పనులకైన మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోవద్దని జిల్లా రవాణాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీసేవ, ఇంటర్నెట్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని నేరుగా కార్యాలయానికి వచ్చి సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యాలయంలో పారదర్శకమైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సారథి వెబ్‌సైట్ ద్వారా స్లాట్‌బుక్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. స్లాట్ బుకింగ్‌కు సంబంధించి పలువురు దరఖాస్తుదారులు తమ దృష్టికి తీసుకువస్తున్నారని ఆ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించామని తెలిపారు. లైసెన్స్‌లు, వాహనాల రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన ఏవైన సమస్యలు ఉంటే కార్యాలయంలో తనను సంప్రదించవచ్చని సూచించారు.



పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అమరవీరుల కుటుంబీకులు

పోలీసు అమరులకు ఘన నివాళి

కామారెడ్డి టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగ ఫలితమే నేటి శాంతి, సౌభ్రాతృత్వమని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాజేష్‌చంద్రతో కలిసి పోలీసు అమరవీరుల స్థూపం వద్ద వారి కుటుంబ సభ్యులతో కలిసి నివాళ్లు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అంతర్గత భద్రత పరిరక్షణ విధుల్లో 7 గురు పోలీసులు అసువులు బాశారని, వారి త్యాగ ఫలం వల్లే గతం కంటే ప్రస్తుత పరిస్థితి మెరుగ్గా ఉందని పోలీసుల త్యాగ నిరతిని నిరంతరం మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు అమరవీరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. ప్రజల రక్షణ, భద్రత, శాంతి స్థాపన కోసం అంకిత భావంతో సేవలందించే వ్యవస్థ పోలీస్ వ్యవస్థ అని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, దేశ అంతర్గత భద్రత, ప్రజల రక్షణలో పోలీసులు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అమరవీరుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి సంక్షేమానికి అన్ని విధాల సహాయం అందిస్తామని తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతల స్థాపన కోసం అసాంఘిక శక్తులతో పోరాడుతూ ప్రాణ త్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమైనవని అన్నారు. వారు చూపిన స్ఫూర్తితో ప్రజల భద్రత, రక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడూ కర్తవ్య నిష్ఠతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. అమరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతీ పౌరుడి బాధ్యత అని, ఆర్మీ జవానులు, పోలీసులు విధి నిర్వాహణలో ఎల్లప్పుడూ ప్రజా రక్షణకు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. 1959 అక్టోబరు 21న లడక్‌లోని అక్సాయ్ చిన్ వద్ద చైనా దళాల దాడిలో 10 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు వీరమరణం పొందిన సందర్భాన్ని గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయంగా కొనసాగుతోంది అని పేర్కొన్నారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా అసాంఘిక శక్తులతో పోరాటంలో 191 మంది పోలీసు సిబ్బంది వీరమరణం పొందగా, తెలంగాణ రాష్ట్రం నుంచి 5 గురు అసిస్టెంట్ కమాండెంట్ బానోత్ జవహర్‌లాల్, కానిస్టేబుళ్లు టి. సందీప్, వడ్ల శ్రీధర్, యం.పవన్ కళ్యాణ్, బి. సైదులు అమరులయ్యారని తెలిపారు. విధి నిర్వాహణలో ప్రాణత్యాగం చేసిన వీరులను స్మరించుకుంటూ, వారి ఆశయాలను నెరవేర్చడం, వారి కుటుంబాల సంక్షేమం కోసం కృషి చేయడం, ఆర్థిక పరమైన ప్రయోజనాలు సమయానికి అందేలా చూడడం, మానసిక బలాన్ని అందించడం ఇవే పోలీస్ అమరవీరులకు మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల స్మరణార్థం జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో అక్టోబరు 31 వరకు రక్తదాన శిబిరాలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, వ్యాసరచన, ఫొటో, వీడియో పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే అమరవీరుల కుటుంబాలను స్వయంగా సందర్శించి వారికి గౌరవప్రదంగా నివాళులు అర్పిస్తామని ఎస్పీ (మిగతా 8వ పేజీలో)

కుటుంబ కలహాలతో టవర్ ఎక్కిన వృద్ధుడు

- పోలీసుల రాకతో కిందకు దిగిన వృద్ధుడు

భిక్కనూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వృద్ధుడు టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన సంఘటన భిక్కనూరు మండలంలోని జంగంపల్లిలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లయ్య ఇటీవల తాగుడుకు బానిసై కుటుంబ సభ్యులతో నిత్యం గొడవపడేవాడు. దాంట్లో భాగంగానే గొడవపడి గ్రామంలోని సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న సెల్ టవర్ ఎక్కి చనిపోతా అంటూ హల్‌చల్ చేశాడు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి ఎస్సై చేరుకుని వృద్ధుడిని సముదాయించారు. నీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో వృద్ధుడు కిందకు దిగాడు. అనంతరం ఎస్సై వృద్ధుడితో మాట్లాడుతూ ఏమైనా సమస్య ఉంటే కుటుంబసభ్యులతో సామరస్యంగా మాట్లాడుకోవాలని లేదంటే తమను సంప్రదిస్తే న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఇలా మరెప్పుడు చేయొద్దని ఆ వృద్ధుడికి ఎస్సై కౌన్సెలింగ్ ఇచ్చారు.



టవర్ ఎక్కిన వృద్ధుడు మల్లయ్య

చెత్తశుద్ధి ఏది?

- కుంటలో చెత్తను వేసిన ప్రజలు
- అధికారులు ఆదేశించినా ఫలితం శూన్యం
- ఖాళీ స్థలాలే చెత్తకు నిలయాలు
- చర్యలు తీసుకోవాలని ప్రజల వేడుకోలు

7



బస్సు వస్తలేదు.. బాధలు తప్పట్లేదు

- రెండు నెలలుగా ఆర్టీసీ బస్సులు కనుమరుగు
- వంతెన బాగు చేసినా కదలని బస్సులు
- 500 మంది విద్యార్థులు చదువులకు దూరం

8





బాలసదనంలో చిన్నారులతో సంబరాల్లో పాల్గొన్న డీడబ్ల్యువో ప్రమీల

ఘనంగా.. దీపావళి

- రకరకాల టపాసులతో చిన్నారులు, పెద్దల ఆనందం
- వ్యాపార సముదాయాలను విద్యుత్ దీపాలతో అలంకరణ
- దుకాణాల్లో లక్ష్మీదేవి పూజలు
- పేకాట స్థావరాలపై దాడి
- రూ.10,40,089 నగదు స్వాధీనం

కామారెడ్డి టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ఆయా మండలాల్లో సోమవారం ఘనంగా దీపావళి వేడుకలను జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే ప్రతీ ఇంట్లో ఉదయాన్నే లేచి పిల్లాపాపలతో తలంటు స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి హారతులు తీసుకున్నారు. సేమియాలు, పేనీలు తిన్నారు. కొత్త అల్లుళ్లలకు కూతుళ్లకు కొత్త బట్టలు పెట్టి దీపావళి వేడుకలను జరుపుకున్నారు. సాయంత్రం లక్ష్మీదేవి అమ్మ వారిని రంగు రంగుల పువ్వులతో, విద్యుత్ దీపాలంకరణతో అందంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో లక్ష్మీ పూజల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వ్యాపారులు దుకాణాలను లక్ష్మీ పూజల కోసం ప్రత్యేక విద్యుత్ దీపాల అలంకరణతో పాటు అరటి, కొబ్బరి, మామిడి ఆకులు, బంతి పూలతో అందంగా అలంకరించారు. జిల్లా కేంద్రంలోని ప్రియా డీలక్స్ రోడ్డు, నిజాంసాగర్ రోడ్డు, కమాన్ రోడ్డు, పెద్ద బజారు, స్టేషన్ రోడ్డు, అడ్లూర్ రోడ్డు, సిరిసిల్ల రోడ్డు, జేపీఎన్ రోడ్డు, తిలక్ రోడ్డు, సుభాష్ రోడ్డు, గాంధీగంజ్‌లోని కిరాణ, బట్టల, ఆభరణాలు, గంజ్ వ్యాపారులు, చిట్‌ఫండ్ వ్యాపారులు, ఆయిల్ మిల్స్, సామిల్స్, హోటళ్లలో, బోర్‌వెల్స్ రియల్ ఏస్టేట్ కార్యాలయాల్లో లక్ష్మీపూజ కార్యక్రమాలు కుటుంబ సమేతంగా, బంధు మిత్రులతో కలిసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బాలసదనంలో డీడబ్ల్యుఓ ప్రమీల చిన్నారులతో దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి.. రూ.10,40,089 స్వాధీనం

జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్‌ల పరిధిలో పేకాట ఆడుతున్న (మిగతా 8వ పేజీలో)

క్రైం సమాచారం

సౌతాఫ్రికాలో భిక్కనూరు యువకుడి మృతి

▸ హత్య చేసి ఉరి వేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ



శ్రీనివాస్ (ఫైల్‌ఫొటో)

భిక్కనూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బతుకుదెరువుకోసం వెళ్లిన యువకుడు దేశం కానీ దేశంలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. అప్పటి వరకు బాగానే కుటుంబసభ్యులతో మాట్లాడి అంతలోనే చనిపోయాడని సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలోకి వెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన బత్తుల శ్రీనివాస్(32) సౌతాఫ్రికాలో బోర్‌బండి ఆపరేటర్‌గా పని చేయడానికి గత ఆరు నెలల కిందట వెళ్లాడు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల వరకు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో బాగానే మాట్లాడాడు. సోమవారం ఉదయం సౌతాఫ్రికా నుంచి సూపర్‌వైజర్ కాల్ చేసి శ్రీనివాస్ ఉండే గోదాంల వెనుకాల చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయాడని ఫొటోలు పంపించాడు. దీంతో కుటుంబసభ్యులు ఒక్కసారిగా షాక్‌లోకి వెళ్లిపోయారు. 'ఆదివారం మధ్యాహ్నం కూడా మాతో బాగానే మాట్లాడాడని, మా వాడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కూడా కాదని, అక్కడ ఏమో జరిగి హత్య చేసి ఆత్మహత్యగా క్రియేట్ చేస్తున్నారని' వారు ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి శ్రీనివాస్‌ను హత్య చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటుగా మృతదేహాన్ని త్వరగా ఇంటికి పంపించేలా చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు. కాగా శ్రీనివాస్ ఇదివరకు చాలా దేశాల్లో పని చేశాడని, ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, తమను కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు. శ్రీనివాస్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి తల్లిదండ్రులు స్వరూప, బలరాం, భార్య నవనీత, కూతురు లాస్య, కుమారుడు నిహాల్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కళ్యాణి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై మహేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బండారి దుర్గయ్య(42) ఇంటి వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మరణించాడని తెలిపారు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని ఇంట్లోకి కోతులు రాకుండా జీఐ వైర్ చుట్టి ఉంచాడని పోల్ నుండి ఉన్న కరెంట్ తీగలకు విచ్చలవిడిగా కోతులు వేలాడటంతో కరెంట్ తీగలు కిందకు జారి ఈ ప్రమాదం జరిగి ఉండోచ్చని భావిస్తున్నామన్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం కుటుంబసభ్యులు అప్పగించామన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

మాచారెడ్డి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దీపావళికి సొంతూరుకు వచ్చిన ఓ ప్రైవేటు లెక్చరర్ తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి మృతిచెందిన సంఘటన మాచారెడ్డిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే మాచారెడ్డి మండలం నెమిలిగుట్ట తాండాకు చెందిన మాలోత్ శ్రీనివాస్(30) హైదరాబాద్‌లోని సీఎంఆర్ కళశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. దీపావళి సందర్భంగా గ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపి తిరిగి మంగళవారం బయలుదేరి బైక్‌పై వెళ్తుండగా కామారెడ్డి వైపు వస్తున్న ట్రావెల్ బస్సు బ్రేక్ ఫేయిలై బైక్‌ను ఢీకొనడంతో శ్రీనివాస్ తీవ్రగాయాలతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భిక్కనూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండు గ నేపథ్యంలో దైవ దర్శనం చే సుకుని తిరిగి గ్రామానికి వస్తున్న ఇద్దరిని లారీ ఢీకొనగా ఒకరు మృతిచెందగా మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఉన్న సం ఘటన మండలంలోని జంగం పల్లి గ్రామశివారులో సోమవా రం చోటుచేసుకుంది. భిక్కనూ రు ఎస్సై ఆంజనేయులు, గ్రామ స్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మంగళి పెద్ద నర్సింలు(56), కొమ్ము భాస్కర్ దీపావళి సందర్భంగా గ్రామశివారులోని కృష్ణ మందిరానికి బైక్‌పై వెళ్లి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఇంటికి వస్తుండగా వెనుకాల అదే వైపు వస్తున్న లారీ(నెం.కేఏ01ఏఎం6499) ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వీరిని పరిక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు రిఫర్ చేయగా హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో పెద్ద నర్సింలు మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన భాస్కర్ చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. రోడ్డు ప్రమాదంలో పెద్ద నర్సింలు మృతిచెందగా గ్రామంలో విషాధ చాయలు నెలకొన్నాయి. మృతుడికి భార్య నర్సవ్వ ఉన్నారు.

కాళ్ల కడియాల కోసం వృద్ధురాలి హత్య



గూగ్‌లోత్ రాదీబాయ్(ఫైల్)

నసురుల్లాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకోల్‌తండాకు చెందిన మెగావత్ సవాయిసింగ్ అనే వ్యక్తి తన ఇంటి వెనక గల గుగులోత్ రాదిబాయ్ (65) అనే వృద్ధురాలిని కాళ్ల కడియాలు, చేతుల కంకణాల కోసం సోమవారం హత్య చేశాడని ఎస్‌ఐ రాఘవేంద్ర తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. దీపావళి సందర్భంగా తన ఇంట్లో పూజల అనంతరం సవాయిసింగ్ వృద్ధురాలి నగల కోసం ఆమె పైన దాడి చేసి నగలను ఎత్తుకొని పోయారు. ఇరుగుపొరుగు వాళ్ల గమనించడంతో ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. నిందితుడైన మెగావాత్ సవాయిసింగ్ అదుపులోకి తీసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్వగ్రామానికి గల్ఫ్ కార్మికుడి మృతదేహం

▸ ఇజ్రాయెల్‌లో మృతిచెందిన వెంకటాపూర్ వాసి

▸ మృతదేహం వద్ద మిన్నంటిన కుటుంబసభ్యుల రోదనలు



అంత్యక్రియల్లో పాల్గొన్న కుటుంబీకులు, ప్రజలు

వేల్పూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తమకు ఆనందాన్ని పంచుతూ ఆదుకుంటాడనుకుంటే అందకుండా పోయావా అంటూ మృతుడు నీరడి బొర్రయ్య(50) భార్య బిడ్డలు రోధించారు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన బొర్రయ్య బతుకుదెరువు కోసం ఇజ్రాయెల్ వెళ్లాడు. అక్కడ బొర్రయ్య ఈ నెల 11న గుండెపోటుతో మృతిచెందాడు. సోమవారం బొర్రయ్య మృతదేహం స్వగ్రామానికి చేరింది. మృతదేహాన్ని చూసిన ఆయన భార్య, కూతుళ్లు, కుమారుడు, తల్లి, అన్నదమ్ములు బోరున విలపించారు. బొర్రయ్య 16 సంవత్సరాలుగా ఇజ్రాయెల్ వెళ్తూ వస్తున్నారు. చిన్న కూతురు పెళ్లి చేసి తిరిగి వెళ్లిన బొర్రయ్య ఇలా గుండెపోటుతో చనిపోతాడని కలలో కూడా అనుకోలేదని కుటుంబ సభ్యులు రోధించారు. తనకు దహన సంస్కారాలు జరిపించాల్సిన కుమారుడు ముందే మరణించాడని తల్లి తీవ్ర విలపించిన తీరు కంటతడి పెట్టించింది.

మొరం వాహనాలు స్వాధీనం

ఏర్గట్ల, అక్టోబరు 21 (ఆం ధ్రజ్యోతి): మండలంలోని తా ళ్లరాంపూర్‌లో అక్రమంగా మొరం తరలిస్తున్న వాహ నాలను స్వాదీనం చేసుకొని, జరిమానా విధించినట్లు తహ సీల్దార్ మల్లయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని తాళ్లరాంపూర్‌లోని బోడగుట్ట ప్రాంతంలోని ప్రభుత్వ భూముల్లో బత్తుల రమణయ్య అనే వ్యక్తి అక్రమంగా మొరం తీస్తుండటంతో రెవెన్యూ అధికారులు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రొక్లెయినర్‌కు 20వేలు, 2 ట్రాక్టర్‌లకు రూ.10వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా మొరం, ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ సదానంద్ ఉన్నారు.



బోధన్‌లో మిఠాయిలు పంచుతున్న దృశ్యం



టపాకాయలు కాలుస్తున్న బీజేపీ నాయకులు

రియాజ్ ఎన్‌కౌంటర్‌పై బీజేపీ సంబరాలు

బోధన్,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్య చేసిన నిందితుడు రియాజ్ ఎన్‌కౌంటర్‌పై బోధన్‌లో బీజేపీ నాయకులు టపాకాయలు కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షులు పసులోటి గోపికిషన్ మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేకమైనటువంటి పనులు చేసే వారికి ఇది సరైన శిక్ష అని, ఎన్‌కౌంటర్ రూపంలో సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ మృతికి న్యాయం జరిగేలా చేసినటువంటి పోలీసులకు బోధన్ ప్రజల ద్వారా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రౌడీ షీటర్ రియాజ్ పోలీసు విధి నిర్వహణలో ఉన్న ప్రమోద్‌ను దారుణంగా నడి రోడ్డుపైన హత్య చేయడం సంచలనం సృష్టించిందన్నారు. కాని పోలీసులు దీపావళి రోజు రియాజ్‌ను ఎన్‌కౌంటర్ చేసి ప్రజలకు నిజమైన దీపావళిని పోలీసులు అందించారని వారి ధైర్య సాహసాలకు సెల్యూట్ చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రి నుంచి రియాజ్ తప్పించుకుంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలతో పోలీసు వ్యవస్థ మీద ప్రజలకు గౌరవం పెరగుతుందన్నారు. పోలీసు వ్యవస్థకు, ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసు ధైర్య సాహసాలను అభినందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గౌడుగు ధర్మపురి, వినోద్, చిన్న, గౌతం, సాగర్, లింగం, అనిల్, దత్తు, కిరణ్, శ్రీకాంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



వేల్పూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలి

వేల్పూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు మొక్కజొన్న, వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధర పొందాలని డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి సూచించారు. వేల్పూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డితో కలిసి ప్రారంభించారు. రైతులు కష్టపడి పండించిన పంటలను మధ్య దళారులకు అమ్మి నష్టాల పాలు కావద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి, మద్దతు ధర పొందాలన్నారు. మక్కలకు మద్దతు ధర ఎంఎస్‌పీ ధర రూ. 2400 ఉంటుందన్నారు. రైతులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు బైడి శ్రీధర్, సొసైటీ కార్యదర్శి కృష్ణ, సొసైటీ, ఏఎంసీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి రోహిత్‌రెడ్డి

పశువులకు టీకాలు వేయించాలి

జక్రాన్‌పల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ రోహిత్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని చందమీయబాగ్‌తండాలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఆయన వేశారు. పశువులకు ఈ సీజన్‌లో గాలికుంటు సోకుతుందని, వ్యాధి నివారణకు తప్పనిసరిగా నివారణ టీకాలు వేయించాలన్నారు. 2004 పశువులకు, 4 ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ ఆశ్రిత తెలిపారు.కార్యక్రమంలో గోపాలమిత్ర రాజ్‌కుమార్, పశువైద్య సిబ్బంది ఉన్నారు.



కొత్తపల్లిలో టీకాలు వేస్తున్న అధికారులు

వేల్పూర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు సకాలంలో రైతులు టీకాలు వేయించి, కాపాడుకోవాలని మండల పశు వైద్యాధికారి సంతోష్‌రెడ్డి సూచించారు. కొత్తపల్లిలో మంగళవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి సోకిన పశువులలో పాల దిగుబడి తగ్గుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సారెడ్డి, వైద్య సిబ్బంది సురేష్, గంగాధర్, దయానంద్, వాజీద్, గోపాల మిత్ర, గ్రామ కమిటి సభ్యులు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేసిన రైతు



గుంతల్లో కంకర సిమెంట్ పోసి పూడ్చి వేస్తున్న రైతు అల్లూరి గంగారెడ్డి

జక్రాన్‌పల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు వివిధ గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ బీటీ రోడ్డు చెడిపోయి భారీ గుంతలు పడగా ఓ రైతు ముందుకు వచ్చి గుంతలలో కంకర సిమెంట్ పోసి పూడ్చివేశారు. మనోహరాబాద్ గ్రామానికి చెందిన రైతు అల్లూరి గంగారెడ్డి ముందుకు వచ్చి మనోహరాబాద్, కొలిప్యాక్, కలిగోట్, చింతలూర్, మైలారం, తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. రైతు గంగారెడ్డి రోడ్డుపై గుంతలలో కంకర, సిమెంట్ కలిపి పోసి గుంతలను పూడ్చివేశాడు. దీంతో ఈ రోడ్లపై ఇరువైపులా వెళ్తున్న వాహనదారులు సాఫీగా వెళ్తున్నారు. బీటీ రోడ్లపై పడిన గుంతలలో కంకర, సిమెంట్ కలిపి పోసి ఈ గుంతలను పూడ్చివేసిన రైతు అల్లూరి గంగారెడ్డిని ప్రజలు అభినందించారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

విద్యార్థులకు మెంటల్ ఎబిలిటీ పరీక్ష



నలంద పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పెర్కిట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంద పాఠశాలలో మంగళవారం ఆర్యభట్ట మెంటల్ ఎబిలిటీ పరీక్ష నిర్వహించారు. 4 నుంచి 9వ తరగతి వరకు తరగతికి నలుగురు విద్యార్థుల చొప్పున సెలక్షన్ చేసి విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఈ అభ్యస్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్షలో విద్యార్థులకు ఐఐటీ, ఒలంపియాడ్ సంబందించిన పరీక్షలు నిర్వహిస్తామని, వీటి వల్ల సైన్స్, ఇంగ్లీష్, గణితశాస్త్రాలలో మెంటల్ ఎబిలీటిలో విద్యార్థులకు భవిష్యత్తులో జేఈఈ మెయిన్స్, ఐఐటీ అడ్వాన్స్, ఎంసెట్ పరీక్షలకు ఉపయోగపడేలా బోధిస్తామని ప్రసాద్, సాగర్ తెలిపారు.



పొగాకు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మానస

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఆర్మూర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ మానస అన్నారు. మంగళవారం ఆర్మూర్ మన్సిపల్ పరిధి పెర్కిట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పొగాకు నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పొగాకుతో తయారైన మత్తు పదార్థాలు సిగరెట్, గుట్కా, తంబాకు, జర్థలాంటి పదార్థాలు తినవద్దన్నారు. మత్తు పదార్థాలు తినడం, మత్తు పానియాలు తాగడం వల్ల అల్సర్, పక్షవాతం, రక్తం గడ్డ కట్టడం, క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడతారన్నారు. చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండి క్రమ శిక్షణ అలవర్చుకుని చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వర్ని,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): వర్ని పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు రోజుల్లో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. 38 మందిని అదుపులోకి తీసుకుని రూ.19,860 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసులు నమోదు చేశామన్నారు.

తాడ్వాయి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలో 9మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. చిట్యాలలో ఐదుగురు, సంతాయిపేట్‌లో నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. చిట్యాలలో 17,800, సంతాయిపేట్‌లో 1110 నగదు, 6సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

బోధన్,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరాలపై దాడి చేసి 29మందిని అరెస్టు చేశామని, వారి నుంచి రూ.35,990 స్వాధీనం చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు.

కోటగిరి,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): దేవునిగుట్టతండాలో పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసి, రూ.8020 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సునీల్ తెలిపారు.

నవీపేట,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): యంచ, మద్దెపల్లి, మోకన్‌పల్లిలలో సోమవారం రాత్రి పేకాట ఆడుతున్న 9మందిని పట్టుకోవడం జరిగిందని ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. వారి నుంచి రూ. 12840 నగదుతో పాటు 5 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఎల్లారెడ్డిరూరల్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి, పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ మంగళవారం తెలిపారు. మల్కాపూర్, వెల్లుట్లపేట, కళ్యాణి, లింగారెడ్డిపేట్, మౌలాన్‌ఖేడ్, సాతేల్లి గ్రామాల్లో 51మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.27,780 నగదు, 26 మొబైల్‌ఫోన్లు, 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

బాన్సువాడ రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపూర్, తాడ్కోల్, నాగారం, కొల్లూర్, ఇబ్రహీంపేట్, తదితర గ్రామాల్లో పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేసి 56 మందిని పట్టుకుని, వారి నుంచి రూ.58,650నగదు, 41మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ తుల శ్రీధర్ మంగళవారం తెలిపారు.

సదాశివనగర్,అక్టోబరు 221(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మెరుపు దాడులు నిర్వహించి పలువురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై పుష్పరాజ్ మంగళవారం తెలిపారు. కుప్రియాల్‌లో నలుగురు, భూంపల్లిలో నలుగురు, ఉట్నూర్‌లె 9మంది పట్టుబడ్డారని తెలిపారు.

భిక్కనూరు,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమల్లారెడ్డి, కాచాపూర్, జంగంపల్లి గ్రామాల్లో పేకాట ఆడుతున్న 16మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.24,680 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు మంగళవారం తెలిపారు. కాచాపూర్‌లో ఆరుగురిని, పెద్దమల్లారెడ్డిలో నలుగురిని, జంగంపల్లిలో ఆరుగురిని అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి 10 మొబైల్‌ఫోన్లు, 9ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

రెంజల్,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దూపల్లి, కూనేపల్లి, రెంజల్, పేపర్‌మిల్ గ్రామాలలో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడి చేసి 19మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. నిందితుల నుంచి 16710రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

లింగంపేట, అక్టోబర్21(ఆంధ్రజ్యోతి): మండలంలో పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ దీపక్‌కుమార్ తెలిపారు. లింగంపల్లి అటవీ ప్రాంతంలో దాడి చేయగా ఏడుగురు జూదరుల నుంచి రూ.5920 నగదు, 4 సెల్‌ఫోన్‌లు, బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

బోధన్,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పేకాట ఆడుతున్న 46మందిని అరెస్టు చేసినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. పేకాట రాయుళ్ల నుంచి రూ.64,200 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ఆర్మూర్ టౌన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం రాత్రి పేకాట ఆడుతున్న 110 మంది వ్యక్తులను పట్టుకొని వారి నుంచి రూ.2,46,840 నగదు స్వాధీనం చేసుకొని, 20 కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.



సాలూరలో విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు



హెగ్డోలిలో శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

సాలూర,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): సాలూర మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రబీ సాగు కొరకు జాతీయ ఆహార భద్రత, పోషకాహార మిషన్ 2025-26లో భాగంగా సబ్సిడీపై రైతులకు శనగ విత్తనాల బ్యాగులను వ్యవసాయ శాఖ అధికారులు, నాయకులు పంపిణీ చేశారు. శనగ బ్యాగు ధర రూ.1800 ఉండగా దీనిలో మొక్క ఎదుగుదలకు కావాల్సిన రసాయన, బయో ఎరువులు సైతం అందజేస్తామని మండల వ్యవసాయ అధికారి శ్వేత పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, సాలూర పీఏసీఎస్ చైర్మన్ అల్లె జనార్ధన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వ్యవసాయ భూములను పరీక్షలు నిర్వహించి, భూసారానికి తగ్గట్టుగా ఎదుగుదలకు కావాల్సిన పోషకాలతో పాటు సేంద్రీయ ఎరువులతో కలుపుకుని రైతులకు అందుబాటులో ఉండే విధంగా అందజేస్తున్నామని అని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా సబ్సిడీ ద్వారా శనగ విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి అపర్ణ, సాలూర పీఏసీఎస్ సీఈవో బస్వంత్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లె రమేష్, అనిల్, డిస్కో సాయిలు, అశోక్, లక్ష్మణ్, రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆహార భద్రత, పోషకాహార మిషన్‌లో భాగంగా రైతులకు ప్రభుత్వం రాయితీపై శనగ విత్తనాలు అందిస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు తెలిపారు. పోతంగల్ మండలంలోని హెగ్డోలి రైతు వేదికలో మంగళవారం రైతులకు రాయితీపై శనగ విత్తనాలను పంపిణీ చేశారు. 25కేజీల బ్యాగు ధర 2500రూపాయలు ఉండగా 1800రూపాయలకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. పోతంగల్ మండలంలో 644 ఎకరాలకు సరిపడ 161క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, మండల వ్యవసాయ అధికారి జి నిశిత, ఏఈవో శంకర్ పాల్గొన్నారు.



యంచలో అకాల వర్షానికి తడిసిన ధాన్యం

వర్షం.. రైతన్నకు కష్టం

నవీపేట,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): నవీపేట మండలంలో మంగళవారం వర్షం కురిసింది. మండలంలోని యంచ, మిట్టాపూర్, ఫకీరాబాద్, కమలాపూర్, మోకన్‌పల్లి తదితర గ్రామాలలో అకాల వర్షం కురిసింది. కల్లాలతో పాటు రోడ్ల పక్కన ఆరబోసిన ధాన్యం పలు చోట్ల తడిసిపోయింది. అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మొబిన్‌ఖాన్‌ను పరామర్శిస్తున్న ఉర్దూ అకాడమీ చైర్మన్, గ్రంథాలయ చైర్మన్

రెంజల్,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యానికి గురైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్‌ను మంగళవారం ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డిలు పరామర్శించారు. మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురైన మొబిన్ ఖాన్ హైదరాబాద్‌లో చికిత్స చేసుకుని స్వగ్రామం సాటాపూర్‌కు రావడంతో ఆయనను వారు పరామర్శించారు. ఆరోగ్యం శ్రద్ధ వహించాలని సూచించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, మాజీ సర్పంచ్ జావీదోద్దీన్, నితిన్, ఉబేద్, తుర్కాన్ తదితరులున్నారు.

మహంతంలో చోరీ

నవీపేట,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహంతంలో ఈ నెల 19న చోరీ జరిగిందని ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. గ్రామానికి చెందిన కళావతి అనే మహిళ తన ఇంట్లోని డబ్బాలో 75వేల రూపాయల నగదును ఉంచి, తలుపునకు గడియ వేసి పని నిమిత్తం బయటకు వెళ్లిందన్నారు. అదే రోజు సాయంత్రం డబ్బాను తెరిచి చూడగా అందులో ఉన్న నగదు కనిపించలేదని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

లబ్ధిదారులకు రుణాలు అందించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

కమ్మర్‌పల్లి,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరమ్మ లబ్ధిదారులకు (మహిళా సంఘాల సభ్యులకు) ఐకేపీ ద్వారా రుణాలు అందించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజాశ్రీనివాస్ అన్నారు. మంగళవారం సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాలను పరిశీలించి, అధికారులకు అందజేశారు. రుణాల మంజూరుతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగుతాయన్నారు. ఈ సమావేశంలో ఐకేపి ఏపీఎం, సిసిలు భాగ్యలక్ష్మీ, పిర్యానాయక్ పాల్గొన్నారు.

పండక్కి చేతికొచ్చిన తెల్ల బంగారం

జుక్కల్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలవ్యాప్తంగా ఖరీఫ్ సీజన్లో రైతులు సాగుచేసిన పత్తి పంట దీపావళి పండుగకు చేతికొచ్చింది. వాణిజ్య పంటగా సాగుచేస్తున్న ఈ పంటకు అన్నదాతలు అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేయడంతో చేలన్నీ తెల్ల బంగారంతో నిండిపోయాయి.

మెట్టభూముల్లో తెల్లబంగారం

జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద, మద్నూర్, జుక్కల్ మండలాల్లో మెట్ట భూములు ఉన్నందున రైతులు ఆరుతడి పంటగా పత్తి పంట సాగు చేస్తారు. సంవత్సరానికి ఒకేసారి పత్తి పంటసాగు చేస్తూ అన్నదాతలు లాభాలు పొందుతున్నారు. పత్తి కాయలు ఒకేసారి పగలడంతో రైతుల చేన్లో పత్తి తెల్ల బంగారం మెరుస్తుంది. చేను నిండా పత్తి తెల్లగా మెరడంతో దీపావళి పండుగ రైతుల ఇంటిలోకి లక్ష్మీ దేవతతో పాటు తెల్ల బంగారం తెచ్చిపెట్టనుందని కర్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎకరానికి రూ.12 వేల పెట్టుబడి

రైతులు ఎకరం పత్తి పంట సాగు చేయడానికి సుమారు రూ.12 వేల పెట్టుబడి పెట్టారు. కాగా ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే పత్తి తీసేందుకు కూలీలను రప్పించి పంటను ఇళ్లలో నిలువ ఉంచుకుంటున్నారు. పత్తి ఏరేందుకు కిలోకు రూ.5 చొప్పున కూలీలకు ఇస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

పంట చేతికొచ్చిందని ఓ వైపు సంతోషం ఉన్నా ప్రభుత్వం, సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఇంకా ప్రారంభించకపోవడంతో రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. వెంటనే పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి క్వింటాల్ ధర రూ.10 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేస్తున్నారు.



కోతకు వచ్చిన పంట

పంట పుష్కలంగా పండింది



ఈ ఏడాది పత్తి పంట పుష్కలంగా పండింది. ప్రతి సంవత్సరం లాగే ఆనవాయితీ ప్రకారం మా పంట చేన్లో పండిన పత్తితో వత్తులు చేసి దీపావళికి లక్ష్మీపూజలు చేశాం. ఎకరానికి పెట్టుబడి డబ్బులు పోను రూ.80 వేల నుండి రూ.లక్ష వరకు లాభం రావొచ్చు.

- సవిత, మహిళా రైతు

పొగమంచు కౌగిలిలో బాన్సువాడ



శీతాకాలపు ఉదయాన బాన్సువాడ పట్టణంలో ప్రకృతి అద్భుతాన్ని ఆవిష్కరించింది. సూర్యుని తొలివెలుగులు భూమిని తాకకముందే దట్టమైన పొగమంచు పట్టణాన్ని ఓ దుప్పటిలా కప్పేసింది. పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో రహదారులపై వాహనాల రాకపోకలు నెమ్మదించాయి. ఈ అద్భుత సందర్భాన్ని పట్టణ ప్రజలు ఆస్వాదించారు.సూర్యుడు ప్రకాశించగానే మంచుతెర తొలగిపోయింది.

- బాన్సువాడ టౌన్, ఆంధ్రజ్యోతి

ధాన్యం తడిసింది.. కన్నీరు మిగిలింది

- అన్నదాతల ఆక్రందన
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు
- తేమశాతం చూడకుండా కొనుగోలు చేయాలి

బాన్సువాడటౌన్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రకోపం మరోసారి అన్నదాతను నిండా ముంచింది. ఆరుగాలం కష్టించి, అప్పులు చేసి పండించిన పంట, చేతికి అందే సమయంలో కురుస్తున్న వర్షాలకు నేలపాలవుతోంది. రైతులకు కోలుకోలేని నష్టాన్ని, తీరని శోకాన్ని మిగులుస్తుంది. అకాల వర్షంతో అన్నదాతల కంట వచ్చే కన్నీరు కాలువలై పారుతోంది. ఏటా పంట పండించి కోత సమయంలో వర్షాలు కురియడంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు.

ధాన్యం వర్షార్పణం..

బాన్సువాడ పట్టణ శివారుతో పాటు పలుచోట్ల ఇటీవల వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుత రోజుల్లో వరి కోతకు ఖరీదైన హైన్ మిషన్లను వాడాల్సి రావడం, ధాన్యాన్ని ఆరబెట్టడానికి అదనపు కూలీల ఖర్చు పెరగడంతో ఆర్థికభారం అధికమవుతోందని అన్నదాతలు వాపోతున్నారు. ఖర్చు ఎక్కువైనా వరికోతలు చేపట్టి, ధాన్యంను రోడ్లపై ఆరబెట్టారు. కానీ దీపావళి రోజున వర్షం కురవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి పండుగ కూడా ప్రశాంతంగా చేసుకోలేని పరిస్థితి నెలకొంది. రాత్రివేళల్లో ధాన్యం కుప్పల వైపుకు పరుగులు తీశారు. వరిధాన్యం కాస్త వర్షంలో తడిసి ముద్దవడంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో ఉండిపోతున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నారు. తడిసిన ధాన్యం తీసుకునేందుకు అధికారులు తేమశాతం పేరుతో ఎక్కడ కొర్రీలు పెడతారోనని ఆందోళన చెందుతున్నారు.



తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళా రైతు

ఇవీ అన్నదాతల డిమాండ్స్

- తడిసిన ధాన్యాన్ని తేమశాతంతో సంబంధం లేకుండా మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.
- భవిష్యత్తులో విపత్తులు సంభవించినపుడు రైతులను ఆదుకునేందుకు పంట బీమా పథకం మరింత సమర్థవంతంగా అమలుచేయాలి.
- ఎవరైనా ఎక్కువగా నష్టపోతే పంట నష్ట పరిహారం చెల్లించాలి
- అధికారులు కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలి.

నేడు సబ్సిడీ విత్తనాల పంపిణీ

మద్నూర్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందజేసే సబ్సిడీ శనగ విత్తనాలను నేడు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ మద్నూర్ రైతువేదికలో పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. జాతీయ ఆహార భద్రత, పోషణ మిషన్ పథకం ద్వారా రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మద్నూర్ మండలానికి 420 బస్తాల సబ్సిడీ విత్తనాలు వచ్చాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మధ్యాహ్నం 2 గంటలకు మద్నూర్ రైతు వేదికలో ఈ పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.



బాన్సువాడలో నివాళులర్పిస్తున్న దృశ్యం

అమరులైన పోలీసులకు నివాళులు

బాన్సువాడటౌన్ , అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసి అమరులైన పోలీసులకు మంగళవారం బాన్సువాడ పోలీసులు ఘన నివాళులర్పించారు. అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పట్టణంలోని రాజీవ్‌చౌరస్తాలో పోలీసులు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో తుల శ్రీధర్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో పోలీసుల చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు, కానిస్టేబుళ్లు, సిబ్బంది తదితరులున్నారు.

దెగ్లూర్‌లో గేదెల ఊరేగింపు



దెగ్లూర్‌లో గేదెలను ఊరేగిస్తున్న రైతులు

మద్నూర్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండలానికి సరిహద్దులో ఉన్న మహారాష్ట్రలోని దెగ్లూర్ పట్టణంలో రైతులు దీపావళి పండుగ సందర్భంగా గేదెలను ఊరేగించడం ఆనవాయితీ. కాగా ఈ ఏడు దీపావళి పండుగ రెండవ రోజున రైతులు గేదెల పండుగ నిర్వహిస్తారు. తెలంగాణలో పొలాల అమావాస్యకు బసవన్నలను, ఆవులను అలంకరించి ఊరేగింపు చేసే విధంగానే, దెగ్లూర్‌లో రైతులు దీపావళి అమావాస్య రెండవ రోజున తమ గేదెలను రంగురంగులతో అలంకరించి వాటి కొమ్ములకు నెమలి పించన్లు కట్టి ఊరేగించారు. నృత్యాలు చేశారు. పట్టణంలో వందలాదిగా గేదెలను ఆలయాల వద్దకు వెళ్లి ప్రదక్షిణలు నిర్వహింపచేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఐపీహెచ్‌ఎస్ బృందం

మద్నూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండల కేంద్రంలోని వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిని మంగళవారం ఐపీహెచ్‌ఎస్ బృందం సభ్యులు సందర్శించారు. భారత ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ద్వారా అందుతున్న ప్రజా ఆరోగ్య సేవలు, ప్రభుత్వ ఆసుపత్రులకు గల నాణ్యత ప్రమాణాలను వాటికి సంబంధించిన మార్గదర్శకాలను బృందం సభ్యులు పరిశీలించారు. ఐపీహెచ్‌ఎస్ ప్రమాణాల ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రాథమిక ప్రత్యేక వైద్య సేవలు, మెరుగైన వైద్య సేవల ద్వారా మెరుగైన ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ నరేన్, కృష్ణ, డాక్టర్ సౌమ్య, కిరణ్ కుమారి, స్నేహ, జిల్లా క్వాలిటీ సపోర్ట్ మేనేజర్ చైతన్య, మద్నూర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఐపీహెచ్‌ఎస్ బృంద సభ్యులతో ఆసుపత్రి సిబ్బంది

మాక్లూర్ పోలీసుస్టేషన్‌లో ఐజీ తనిఖీలు



సీపీ సాయిచైతన్యతో మాట్లాడుతున్న ఐజీ చంద్రశేఖర్ రెడ్డి

మాక్లూర్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): మాక్లూర్ పోలీసుస్టేషన్‌ను మంగళవారం మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన ఆయన నూతన పోలీస్ స్టేషన్‌ను పరిశీలించి కేసుల నమోదు వివరాలు, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సైలకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీపీ సాయిచైతన్య, మాక్లూర్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజశేఖర్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయండి



మెండోరా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మెండోరా, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డికి రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేద్రాలను సొసైటీ పరిధిలోని ఏర్పాటు చేయాలని జాబితా విడుదల చేశారు. అందులో సావెల్ సొసైటీ పరిధి గ్రామాల్లో కొనుగోలు చేయాలని జాబితా ఉన్న కానీ నేటి వరకు కొనుగోలు చేయకపోవడంతో రైతులు నేటి వరకు తమ కల్లాల్లో మొక్కజొన్న నిల్వ ఉంచారు. మంగళవారం సాయంత్రం అకాల వర్షం కురవడంతో చేతికి వచ్చిన పంట వర్షానికి తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చశారు. ఇప్పటికైనా అధికార యంత్రాగం స్పందించి సావెల్ సొసైటీ పరిధి గ్రామల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

థాయిలాండ్ విశ్వవిద్యాలయంలో పరిశోధకునిగా నియామకం

ఆర్మూర్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం చేపూర్‌లోని క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ, హెచ్‌వోడీగా పనిచేస్తున్న డాక్టర్ మాడవీడి సుధాకర్ థాయిలాండ్‌లోని షినావత్ర విశ్వవిద్యాలయంలో పరిశోధకునిగా నియమితులైనట్లు కళాశాల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ తెలిపారు. అక్టోబర్ 2025 నుంచి డిసెంబర్ 2028 వరకు విశ్వవిద్యాలయ రీసెర్చ్ ఫెలోగా సుధాకర్ కొనసాగనున్నారు. ఈ నియామకం ద్వారా ఎస్‌ఐయూ ఫ్యాకల్టీతో ఉమ్మడి పరిశోధన ప్రచురణ ప్రాజెక్టులలో పాల్గొంటు పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులను పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. ఈ మేరకు సుధాకర్‌ను అభినందించారు.

సిరికొండలో వాలీబాల్ పోటీలు

సిరికొండ, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): సిరికొండ మండల కేంద్రంలో బుధ, గురువారాల్లో రెండురోజుల పాటు యువకులకు వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్సై జాడీ రామకృష్ణ తెలిపారు. యువతకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకు సిరికొండ- ధర్పల్లి మండలాల స్థాయిలో ఈ క్రీడా పోటీలను సిరికొండలో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ రెండు మండలాల నుండి సుమారు 22 జట్లు పాల్గొంటాయన్నారు. క్రీడా పోటీలను ప్రతిభ పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.



కొండాపూర్‌లో కానిస్టేబుల్ ప్రమోద్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న యువకులు

కానిస్టేబుల్ ప్రమోద్‌కు నివాళులు

సిరికొండ, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న నిజామాబాద్ పట్టణంలో రౌడీషీటర్ రియాజ్ చేతిలో మరణించిన కానిస్టేబుల్ ప్రమోద్‌కు కొండాపూర్ గ్రామంలో యువకులు ఘనంగా నివాళులు అర్పించారు. నేరాలకు పాల్పడిన షేక్ రియాజ్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా కత్తితో దాడి చేసి ప్రమోద్‌ను హత్య చేసిన విషయం విదితమే. ఈ సందర్భంగా కొండాపూర్ గ్రామంలో యువకులు కొవ్వొతులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రధాన వీధుల గుండా ఈ ర్యాలీ సాగింది. అనంతరం గ్రామ కూడలిలో ప్రమోద్ అమర్‌హై అంటూ నినాదాలు చేశారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని కోరుకున్నారు.

రెంజర్లలో కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ కోమటి శెట్టి గంగాధర్

ముప్కాల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):ముప్కాల్ మండలంలోని రెంజర్ల సొసైటీ పరిధిలో మంగళవారం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ కోమటి శెట్టి గంగాధర్ ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా సొసైటీలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధరకు అమ్మి రైతులు లాభపడాలని ఆయన సూచించారు. మొక్కజొన్నకు 2400, వరికి 2389 మొదటి రకానికి, బి గ్రేడ్‌కు 2369 మద్దతు ధర ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్, సొసైటీ సెక్రటరీ గంగాధర్, సంతోష్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

చెత్తశుద్ధి ఏది?

- పట్టణ సమీపంలో కుంటలో పారబోస్తున్న వైనం
- అధికారులు ఆదేశించినా ఫలితం శూన్యం
- ఖాళీ స్థలాలే చెత్తకు నిలయాలు
- చర్యలు తీసుకోవాలని ప్రజల వేడుకోలు

ఎల్లారెడ్డి, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ సమీపంలోని డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్ (డీఆర్‌సీసీ) నిరుపయోగంగా మారింది. అధికారుల నిర్లక్ష్యంతో వినియోగంలోకి రాకుండా పోయింది. దీంతో ప్రతి ఇంటి నుంచి సేకరించిన చెత్తను పట్టణ సమీపంలో ఉన్న కుంట పక్కన ఖాళీ స్థలంలో పారవేయడం, అనంతరం నిప్పంటించడంతో పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయి.

ఖాళీస్థలాల్లో చెత్త

పట్టణంలోని ఇల్లు, వ్యాపార సంస్థల నుంచి సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి వాటితో డీఆర్‌సీసీలో సేంద్రియ ఎరువు తయారు చేసే అవకాశం ఉంది. కాగా సెంటర్ ఉపయోగంలోకి రాకపోవడంతో సేకరించిన చెత్తను వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించకుండా ఖాళీ స్థలాలు కనిపించిన చోటే ఇష్టానుసారంగా పారవేస్తున్నారు. చెత్తకుప్పలు ఎక్కువ కాగానే నిప్పు అంటిస్తున్నారు. అలాగే ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కన ఉన్న కుంటలో పారవేస్తున్నారు. నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు గతంలో పట్టణంలో సేకరించిన చెత్తను కుంటల్లో వేయకూడదని పలుమార్లు ఆదేశాలు ఇచ్చిన మున్సిపల్ సిబ్బంది బేఖాతరు చేస్తున్నారు. ఎల్లారెడ్డి సోమార్పేట్ బైపాస్ పక్కన సర్వేనంబర్ 1406లో డీఆర్‌సీసీ నిర్మాణం పనులు లక్షల రూపాయలతో నిర్మాణం చేపట్టగా చిన్న చిన్న పనులు మినహా మీద నిర్మాణ పనులు పూర్తి చేశారు. డంపింగ్ యార్డులో చెత్త వేయకుండా ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ చెత్తను ఇష్టానుసారంగా పారబోస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. పట్టణంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి చెత్తశుద్ధీకరణ చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ వివరణ కోరగా పట్టణంలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నిరుపయోగంగా ఉన్న డీఆర్‌సీసీ



చెత్తను కాలుస్తున్న దృశ్యం



చెత్తను కుంటలో పారబోస్తున్న దృశ్యం

సిటిజన్ సర్వేలో పాల్గొనాలి

● కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పిలుపు



సుభాష్‌నగర్, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి) :తెలంగాణా రాష్ట్ర భవిష్యత్తు రూపకల్పనకై ఉద్దేశించిన "తెలంగాణ రైజింగ్ - 2047 " సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సిటిజన్ సర్వేలో కేవలం తెలంగాణ నుండే కాకుండా వివిధ ప్రాంతాల నుండి కూడా అన్ని వర్గాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందజేస్తున్నారని అన్నారు. భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ - 2047 " సిటిజన్ సర్వేను చేపట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుందని, ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున వెబ్సైట్ ను సందర్శించి ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు , సూచనలను అందించాల్సిందిగా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

పీఎం బీమా యోజన చెక్కుల పంపిణీ

వేల్పూర్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చల నడ్కుడ గ్రామంలో ఇటీవల మరణించిన ముగ్గురు వ్యక్తుల కుటుంబాలకు మంజూరైన పీఎం జీవనజ్యోతి బీమా యోజన చెక్కులను సీఎఫ్ఎల్ కౌన్సిలర్ వినోద్, సుధాకర్, బ్యాంక్ సిబ్బంది అందజేశారు. గ్రామానికి చెందిన ఈదుల్లా శంకర్ గుండెపోటుతో చనిపోగా అతనికి నామినీగా ఉన్న ఈదుల్లా కళ్యాణ్‌కు, అలాగే అనారోగ్యంతో మరణించిన కోనపల్లి అనంత్‌రావుకు నామిని అయిన ఆయన భార్య కోనపల్లి లింగుకు, రోడ్డు ప్రమాదంలో మరణించిన కుర్ల పోశన్నకు నామిని అయిన ఆయన భార్య కుర్ల బోజమ్మకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ప్రధాన మంత్రి సురక్ష బీమా, జీవనజ్యోతి బీమా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పచ్చల నడ్కుడ బీజీబీ బ్యాంక్ మేనేజర్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు



భిక్కనూరులో పూజలు నిర్వహిస్తున్న వ్యాపారులు

బాన్సువాడటౌన్, భిక్కనూరు, మద్నూర్, జుక్కల్, మహమ్మద్ నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతికి అద్దం పట్టే వెలుగుల పండుగ దీపావళిని సోమవారం కామారెడ్డి జిల్లా ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉల్లాసంగా నిర్వహించుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయాన్ని చాటుతూ ప్రతీ ఇల్లు దీపాల కాంతులతో మెరిసిపోయింది. కొత్త వస్త్రాలు ధరించి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఒకరికొకరు మిఠాయిలు పంచుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకలను జరుపుకున్నారు. ప్రజలు గృహాలలో, వ్యాపారస్తులు తమతమ దుకాణ సముదాయాలలో రాత్రి పూట లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాణాసంచా పేలుస్తూ అందరితోనూ ఆనందంగా గడిపారు. దీపావళి పండుగ సంబురాలను సోమవారం బాన్సువాడ పట్టణ ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మద్నూర్‌లో ప్రభాద్ బేరీ కార్యక్రమం నిర్వహించారు.



కుటుంబీకులతో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పోచారం



బాన్సువాడలో యువత సంబరాల దృశ్యం



మద్నూర్‌లో ప్రభాత బేరీ నిర్వహిస్తున్న భక్తులు

అమావాస్య అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రతినిధులు

భిక్కనూరు, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గాంధీ చౌరస్తాలో అమావాస్య అన్నప్రసాద వితరణ సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాసమితి ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రతి అమావాస్య రోజున గాంధీ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ముందుగా స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

దీపావళి జరుపుకోని గుర్జకుంట గ్రామస్థులు

భిక్కనూరు, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్జకుంట గ్రామానికి చెందిన కుంట ప్రభాకర్ రెడ్డి తన ఇంటిముందు ఉన్న పశువుల తొట్టెను వాస్తుకు లేదనే కారణంలో తొలగించాడు. ఈ క్రమంలో గ్రామస్థులతో వివాదం జరగగా పురుగు మందు తాగాడు. ఆ తర్వాత అతని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదుచేయగా గ్రామానికి చెందిన ఏడుగురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులు పండగను బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామం కోసం తాము మంచి పనిచేస్తే, పోలీసులు మాత్రం ఒకరి మాటలు విని ఏడుగురిని అరెస్ట్ చేసి పండగ జరుపుకోకుండా చేశారన్నారు. పంటలు చేతికొస్తున్న సమయంలో పోలీసులు తమ గ్రామస్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సోమవారం రిమాండ్‌లో ఉన్న వారిని చూడటానికి తామంతా వెళ్లినా కలుసుకోనివ్వలేదన్నారు. తమ గ్రామస్థులు ఎప్పుడు ఇంటికి వస్తారో ఆరోజే పండగ జరుపుకొంటామన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి రమేష్

తాడ్వాయి, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరడ్‌పల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. మంగళవారం గ్రామంలో పశు వైద్యశిబిరం ఏర్పాటు చేసి పశువులకు టీకాలు వేశారు. పాడి రైతులు తప్పకుండా టీకాలు వేయించాలని తెలిపారు. ఇందులో గ్రామస్థులు, రైతుల తదితరులు ఉన్నారు.

పాలకవర్గానికి బాధ్యతలు అప్పగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ మాజీ చైర్మన్, డైరెక్టర్లు

తాడ్వాయి, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి సొసైటీ పాలకవర్గానికి వెంటనే బాధ్యతలు అప్పజెప్పాలని సొసైటీ మాజీ చైర్మన్ కపిల్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పు వచ్చి నెలరోజులవుతున్నా డీసీవో రాజకీయ ఒత్తిళ్లకు కోర్టు తీర్పును కూడా పాటించకుండా సొసైటీ చైర్మన్, పాలకవర్గ నియమించే ప్రక్రియ మొదలుపెట్టడం లేదని ఆరోపించారు. కోర్టు ఆర్డర్ వచ్చి దాదాపు నెలరోజులు కావస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే రోజుల్లో మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసే బాధ్యత ఉంటుందన్నారు. ఈ నిర్లక్ష్యం వలన రైతులకు నష్టం వాటిల్లే పరిస్థితి ఉందని తెలిపారు. సొసైటీ రాజకీయ నాయకులకు అండగా నిలవకుండా రైతులకు అండగా నిలవాలని అధికారులకు సూచించారు. రేపటిలోగా కోర్టు తీర్పు ప్రకారం ఆర్డర్ ఇవ్వకపోతే పెద్ద మొత్తంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రైతులు, సొసైటీ మాజీ డైరెక్టర్లు, తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

పాల్వంచ, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండలకేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గ్యార చంద్రం, అధ్యక్షుడిగా మంద లక్ష్మీనర్సు, ఉపాధ్యక్షుడిగా గంధం నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా శంకర్‌బాబు, కోశాధికారిగా షైనయ్య, కార్యదర్శిగా డెబ్బటి రవి, సలహాదారులుగా లక్ష్మణ్, నర్సింలు, రమేష్, శ్రీనులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఐక్యంగా ముందుకెళ్తూ అందరి సహకారంతో నడుచుకుంటామన్నారు.

అతిథి ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

బిచ్కుంద, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): బిచ్కుంద మండల పరిధిలో గల మహాత్మా జ్యోతిభాపూలే గురుకుల పాఠశాలలో సాంఘిక శాస్త్రం సబ్జెక్టు బోధించేందుకు ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ భారత్ భూషణ్ తెలిపారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు డెమో, ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు బీఎడ్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సంబంధిత సర్టిఫికెట్స్‌తో పాటు ఒక జిరాక్స్ సెట్ తీసుకొనిరావాలని కోరారు.

బార్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నందరమేష్

కామారెడ్డిటౌన్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ బార్ అసోసియేషన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన స్టేట్ ఎగ్జిక్యూటివ్ ఎన్నికలలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నంద రమేష్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం రమేష్ కామారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. నిజామాబాద్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిరెడ్డి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు.

డీఎస్పీ ఉద్యోగం సాధించిన రోజాబాయికి సన్మానం



రోజాబాయిని సన్మానిస్తున్న తండావాసులు

మహమ్మద్‌నగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలంలోని గిర్ని తాండాకు చెందిన కడావత్ రోజాబాయికి ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలో డీఎస్పీగా ఉద్యోగం సాధించింది. ఈ మేరకు మంగళవారం తండా వాసులు, కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజాబాయిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సవాయిసింగ్, ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం మాజీ ఉపాధ్యక్షుడు కిషన్ రాథోడ్, ఏఎంసీ డైరెక్టర్ బలరాం నాయక్, శత్రు, షేక్ గౌస్, చందర్, సుందర్, హరిసింగ్, నక్కు, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నగుట్ట వద్ద తవ్వకాలు

- అడ్డుకున్న మర్కల్ గ్రామస్థులు
- పక్కాగా సర్వే నిర్వహించాలని వినతి

సదాశివనగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామ శివారులోని మల్లన్నగుట్ట వద్ద జరుగుతున్న తవ్వకాలను మంగళవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. సర్వే నంబర్ 271, 273, 268లో మల్లన్నగుట్ట అసైన్డ్ భూములు ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. సర్వే ప్రకారం 100ఎకరాలు అసైన్డ్ ఉండగా గతంలో కొందరు చుట్టుపక్కల ఉన్న పట్టాభూములను కొనుగోలు చేసి ఆక్రమించారని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం గోదాంల పక్కన రైస్‌మిల్ ఏర్పాటుకోసం పనులు నిర్వహిస్తున్నారు. అయితే రైస్‌మిల్ నిర్మాణం పూర్తి కావస్తున్న సమయంలో గుట్ట అంచున తవ్వకాలు నిర్వహిస్తున్నారని సమాచారం గ్రామస్థులు అందింది. దీంతో మంగళవారం రైస్‌మిల్ పక్కన గుట్ట ప్రాంతానికి చేరుకుని పనులు కొనసాగిస్తున్న జేసీబీని అడుకొన్నారు. అనంతరం సదాశివనగర్ తహసీల్దార్ సత్యనారాయణకు ఫిర్యాదుచేశారు. 271 సర్వే నంబర్‌లో అసైన్మెంట్ ఎంత ఉంది..? ప్రస్తుతం ఎంత మిగిలింది..? సర్వే నిర్వహిస్తే అసలు బండారం బయటపడుతుందని అంటున్నారు. ప్రభుత్వ అధికారులు పక్కాగా సర్వే చేపట్టి ప్రభుత్వ భూమిని కాపాడాలన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

పోలీసు అమరులకు ఘన నివాళి

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కే.నరసింహారెడ్డి, కామారెడ్డి ఏఎస్పీ బి. చైతన్యరెడ్డి, సీఐలు నరహరి, రామన్, సంతోష్ కుమార్, ఆర్ఐ నవీన్ కుమార్, సంతోష్ కుమార్, కృష్ణ, ఎస్సైలు అమరవీరుల కుటుంబీకులు పాల్గొన్నారు.

సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలి

తెలంగాణ రాష్ట్రభవిష్యత్ రూపకల్పనకు ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్-2047 సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పిలుపునిచ్చారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందజేశారని తెలిపారు. భారతదేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వేను చేపట్టిందని తెలిపారు. ఈనెల 25తో ఈ సర్వే ముగుస్తుందని ప్రతి ఒక్కరు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్‌ను సందర్శి తమ సలహాలు,సూచనలు అందించాలన్నారు.

పత్తి రైతులు స్లాట్‌బుకింగ్ చేసుకోవాలి

ప్రతిరైతులు సీసీఐలో పత్తిఅమ్మేందుకు స్లాట్‌బుకింగ్ తప్పనిసరిగా చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. కాపాస్‌కిసాన్ అనే యాప్‌ను తమ సెల్‌ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. మద్నూర్‌లోని జిన్నింగ్ మిల్లు కృష్ణానాచురల్ ఫైబర్ జిన్నింగ్ మిల్లును ముందుగా సీసీఐ వారు ఎల్1లో ఎన్నుకున్నారని తెలిపారు. రైతులకు అవగాహన లేకపోతే ఏఈవోలు,ఏఓల వద్దకు లేదా ఏఎంసీల వద్దకు వెళ్లిన స్లాట్ బుకింగ్ చేసి ఇస్తారని తెలిపారు.స్లాట్‌బుకింగ్ లేకుంటే సీసీఐలో అమ్ముకోవడానికి వీలు లేదని పత్తిరైతులు 8శాతం తేమ ఉండేవిధంగా చూడాలని రూ.8110 ఎంఎస్‌పీ ధర అందించబడుతుందన్నారు.

ఇన్‌చార్జి ఎస్సైగా భువనేశ్వర్



బాధ్యతలు స్వీకరిస్తున్న భువనేశ్వర్

రామారెడ్డి, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండల ఇన్‌చార్జి ఎస్ఐగా భువనేశ్వర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత కారణాలతో ఒకరిపై ఒకరు దాడులు నిర్వహించరాదని పేర్కొన్నారు. అందరి సహకారంతో మండలంలో శాంతిభద్రతల నిర్వహణను పక్కాగా కృషి చేస్తానని చెప్పారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు శీనివాస్ గౌడ్

పాల్వంచ, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండల బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా నిజాంపేట్ శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా రమేష్ యాదవ్, చాకలి నాగయ్య, ప్రధాన కార్యదర్శిగా తోట బాల్‌రాజు, కోశాధికారిగా ఇసాయిపేట్ శంకర్ బాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకముంచి అధ్యక్షుడిగా నియమించిన మాజీ ఎమ్మెల్యే గోవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడే ప్రమాణస్వీకారం



మాట్లాడుతున్న ఇంద్రకరణ్‌రెడ్డి

భిక్కనూరు, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీ సిద్ధరామేశ్వర ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భక్తులు, ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి మంగళవారం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధ వారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించే కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, మంత్రి సీతక్క, ఎంపీ సురేష్ షెట్కార్ హాజరుకానున్నట్లు తెలిపారు. విండో చైర్మన్ గంగల భూమయ్య, నాయకులు లింబాద్రి, మహిపాల్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవాలి

రామారెడ్డి, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): ఆటో, ఈకో వాహన కార్మికులకు ప్రభుత్వం సహకరించాలే చూడాలని, ఈ విషయాన్ని ప్రభుత్వ సలహాదారుడు మహమ్మద్ షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లాలని రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డికి పలువురు కార్మికులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అశోక్ కుమార్, నరేష్ గౌడ్, సంతోష్, తదితరులున్నారు.



ఎడ్లబండ్ల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

ఘనంగా ఎడ్లబండ్ల ఊరేగింపు

దోమకొండ, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం సందర్భంగా బీబీపేట మండల కేంద్రంలో పెద్దమ్మ ఆలయం వద్ద ఎడ్లబండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు. మాజీ ఎంపీటీసీ కొరివి నీరజ మాట్లాడుతూ.. ఏటా దీపావళి సందర్భంగా సంప్రదాయబద్ధంగా బోనాలు తీసి అమ్మవారికి సమర్పిస్తామని తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో చల్లగా ఉండాలని ఈ కార్యక్రమం చేపడుతామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బోనాలతో మహిళలు

బస్సు వస్తలేదు.. బాధలు తప్పట్లేదు

- రెండు నెలలుగా ఆర్టీసీ బస్సులు కనుమరుగు
- వంతెన బాగుచేసినా కదలని బస్సులు
- 500మంది విద్యార్థులు చదువులకు దూరం

లింగంపేట, అక్టోబర్ 21, (ఆంధ్రజ్యోతి): రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని లింగంపల్లి ఖుర్దు వద్ద ఎల్లారెడ్డి-కామారెడ్డి వంతెన తెగిపోయింది. దీంతో లింగంపేట సహా కామారెడ్డి-ఎల్లారెడ్డి, నిజాంసాగర్, పిట్లం, లింగంపేట మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి మీదుగా గోపాల్‌పేట, పొల్కంపేట, బాణాపూర్-గాంధారి బస్సులను ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. వెరసి రెండు నెలలుగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆర్టీసీ బస్సులు కనుమరుగయ్యాయని మండలంలోని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రయాణానికి ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు.

● గ్రామాలకు వెళ్లే ఆటోలు రూ.40 నుంచి 50 వరకు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు, ఇతర అవసరాలు ఉన్న వారు ఎలాగోలా డబ్బులు పెట్టుకుని వస్తుండగా మండలం నుంచి సుమారు 500 మంది వరకు పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులు ఉన్నారు. అంతేకాకుండా ఇతర ఉన్నత చదువులు చదువుకునే విద్యార్థులు సైతం చదువులకు దూరమవ్వాల్సిన పరిస్థితి నెలకొంటుందని చెబుతున్నారు. నిత్యం రాను పోను ఖర్చులు రూ.100 వరకు అవుతున్నాయని, దీంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లలేకపోతున్నామని వాపోతున్నారు.

● మంగళవారం కామారెడ్డి- లింగంపేట, ఎల్లారెడ్డి, నిజాంసాగర్, పిట్లం వరకు బస్సులు పునరుద్దరించిన అధికారులు మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి మీదుగా గోపాల్‌పేట బస్సును, బాణాపూర్ గాంధారి బస్సును, పొల్కంపేట బస్సును మరిచిపోయాని మండలంలోని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే గ్రామాలకు సైతం బస్సులను పునరుద్దరించాని వారు కోరుతున్నారు.



గ్రామాలకు వెళ్లని ఆర్టీసీ బస్సులు

ప్రతిరోజు రూ.100 ఖర్చు అవుతుంది

2 నెలలుగా బస్సులు లేక కళాశాలకు సరిగా వెళ్లట్లేదు. కళాశాలలో ఎఫ్ఆర్ఎస్ ఉందని లెక్చరర్లు నిత్యం ఫోన్‌లు చేస్తున్నారు. మా ఇంట్లో రోజు రూ.100 ఇవ్వాలంటే కష్టంగా ఉంది. ఆర్టీసీ అధికారులు గ్రామానికి బస్సులు పునరుద్ధరించి చదువులకు ఆటంకం కలగకుండా చూడాలి.

● సంపత్‌కుమార్, ఇంటర్ విద్యార్థి, శెట్పల్లిసంగారెడ్డి

ఇంట్లో కళాశాలకు వెళ్లొదని అంటున్నారు

గ్రామానికి బస్సులు రాకపోవడంతో ఇబ్బందిగా ఉంది. సరిగా చదువకోలేకపోతున్నాం. ఇంట్లో నిత్యం డబ్బులు ఇవ్వాలంటే ఇవ్వలేకపోతున్నారు. చదువు మానేసి ఇంటి దగ్గరే ఉండమని చెబుతున్నారు. గ్రామాలకు వెంటనే బస్సులు పునరుద్ధరించాలి.

● మోహన్, ఇంటర్ విద్యార్థి, ఎక్కపల్లి



అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న పోలీసులు

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధినిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని, వారి సేవలను స్మరించుకున్నారు. నిరంతరం సమాజంలో శాంతిని నెలకొల్పడానికి కృషిచేస్తున్న ప్రతి పోలీసు గొప్ప రక్షకుడన్నారు.

రజక సంఘం షెడ్డు నిర్మాణానికి మ్యాప్ అందజేత

దోమకొండ, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రజకసంఘం షెడ్డు నిర్మాణానికి మ్యాప్ అందించడం జరిగిందని బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రవి తెలిపారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తన సొంతనిధులతో ఈ షెడ్డు నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, మనోజ్‌కుమార్, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మ్యాప్ అందజేస్తున్న దృశ్యం

ఘనంగా దీపావళి

(5వ పేజీ తరువాయి)

వారిని పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్‌చంద్ర మాట్లాడుతూ ఆయా పోలీసుస్టేషన్‌ల పరిధిలో మొత్తం 82 కేసులలో 469 మందిపై కేసులు నమోదు చేయడంతో పాటు 321 సెల్ ఫోన్‌లు, 45 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపా రు. రూ. 10లక్షల 40వేల 089 లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు వ్యక్తి కుటుంబం, సమాజానికి ఘోరమైన హాని కలిగిస్తాయని తెలిపారు. ఇవి వ్యక్తులను అప్పుల్లోకి దింపి ఆర్థిక విధ్వంసానికి గురి చేస్తాయని తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, ఫామ్‌హౌస్‌లు, గ్రామాలు, పట్టణాల్లో చట్టవ్యతిరేక కార్యక్రమాలు ఎవరైన నిర్వహిస్తున్నట్లు తెలిసినా లేదా ఎవరూ ఎలాంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే కంట్రోల్ రూం నెంబర్ 87126 86133, 100 డయల్ లేదా సంబంధిత పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

చేతికొచ్చిన ధాన్యం నీటిపాలు

మహమ్మద్‌నగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలంలోని తూంకీపల్లి తాండాలో అకాలవర్షం కారణంగా రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దైంది. ఆరబెట్టిన ధాన్యం తడవడంతో రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి నానా అవస్థలు పడ్డారు. చేతికొచ్చిన పంట వర్షార్పణం కావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండ పండిస్తే తీరా.. పంట చేతికొచ్చాక ఇలా తడిసిపోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. పంట వేసిన నాటి నుంచి చేతికొచ్చే వరకు ఎన్నో రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. వరదకు ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు. అదేవిధంగా ప్రభుత్వం తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



తడిసిన ధాన్యాన్ని కుప్పలు చేస్తున్న రైతు

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కానిస్టేబుల్
ప్రియ 35- కాంతార
దర్శన్- మిరాయి

బాన్సువాడ

మహేశ్వరి	డ్యూడ్
వెంకటేశ్వర	కె- ర్యాంప్

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230